క్లుప్తంగా

గర్భగుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయ గర్భ గుడి నిర్మాణానికి సోమవారం దివంగత నరిశేపల్లి రమేష్‌గుప్తా సతీమణి ఎస్.ఇంది రమ్మ రూ.50,001 విరాళం అందజేశారు. వారి కుమారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వెంకటగుప్తా, ఎస్.సాయి అభిషేక్ నగదును ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మకు అందజేశారు.

ఎంపీపీగా వెంకటరామిరెడ్డి ఏకగ్రీవం



ఎంపీపీగా ఏకగ్రీవమైన వెంకటరామిరెడ్డికి డిక్లరేషన్ అందిస్తున్న స్పెషలాఫీసర్

పెద్దపప్పూరు: మండల ఎంపీపీగా జి.వెంకటరామిరెడ్డి (బొందలదిన్నె రామయ్య) సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఎంపీటీసీలతో స్పెషలాఫీసర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ లక్ష్మానాయక్ కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. 8 మంది ఎంపీటీసీలు వెంకటరామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వెంకటరామిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్ ఎన్నికలు



సుగుణమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు సుగుణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామంలో ఉప సర్పంచ్ ఎన్నికను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి నిర్వహించారు. సుగుణమ్మను ఉప సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుగుణమ్మకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి, సర్పంచ్ గోపాల్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

గస్తీ పెంచాలి

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని ఆయుర్వేదిక్ మెడికల్ కళాశాల పరిసరాల్లో పోలీసు గస్తీని పెంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డీఎస్పీ నరసింగప్పను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. సోమవారం డీఎస్పీని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, నాయకులు దేవేంద్ర, రామాంజనేయులు, జిలాన్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధరాంపురం విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్ధరాంపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, పీడీ శంకర్ సోమవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో పాఠశాల విద్యార్థులు రోహిత్‌రెడ్డి, సిరివెన్నెల జూనియర్ విభాగంలో రాజేశ్వరి, తేజశ్విని జిల్లాలో స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. వీరు త్వరలో నెల్లూరు, చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ అండర్ (16-19) పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని మైనాపురం గ్రామ సమీప పొలాల్లో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గుర్తుపట్టడానికి కూడా వీలుకాని విధంగా పూర్తిగా కుళ్లిపోయి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన రైతులు వెంటనే వీఆర్‌ఓ శ్రీధర్‌కు సమాచారం అందించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శరీరంపై దుస్తులు కూడా లేకపోవడంతో ఆనవాలు తెలుసుకోవడం కష్టంగా ఉందన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గార్లదిన్నె: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. సోమవారం మండలంలోని శివరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.

విస్తారంగా వర్షాలు



పుట్లూరు: శనగలగూడూరులో పారుతున్న వర్షపు నీరు



పెద్దపప్పూరు: చిక్కేపల్లి గ్రామంలో పారుతున్న వర్షపునీరు

తాడిపత్రి: తాడిపత్రి నియోజకవర్గవ్యాప్తంగా వర్షం కుమ్మేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. తాడిపత్రిలో 52.6 మి.మీ , పెద్దపప్పూరులో 46.2 మి.మీ, యాడికిలో 45.4 మి.మీ, పెద్దవడుగూరు మండలంలో 59.4 మి. మీటర్ల వర్షపాతం నమోదైంది.

పెద్దవడుగూరు: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జామున వరకు భారీ వర్షం కురిసింది. లక్ష్ముంపల్లి, ముప్పాల గుత్తి, పెద్దవడుగూరు, తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలల్లోని పంటలు వర్షం నీట మునిగాయి.

పెద్దపప్పూరు: మండలంలో సోమవారం తెల్లవారు జామున రెండు గంటల నుంచి దాదాపు మూడు గంటల పాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. నామనాంకపల్లి వద్ద వంక ఉధృతంగా పారడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. చిక్కేపల్లిలోని ఆంజనేయస్వామి గుడి వద్ద వర్షపునీటి ప్రవాహంతో గ్రామస్తులు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. వివిధ గ్రామాల్లోని వంకల్లోని వర్షపునీరు పెన్నానదిలోకి వచ్చిచేరడంతో పెన్నానది జలకళ సంతరించుకుంది.

శింగనమలలో 48.2 మి.మీ వర్షపాతం

శింగనమల: నియోజకవర్గంలో ఆదివారం రాత్రి, సోమవారం వర్షం పడింది. దీంతో వంకలు, వాగుల్లో నీరు పారింది. శింగనమల మండలంలో 48.2 మి.మీ , గార్లదిన్నె మండలంలో 47.4 మి.మీ, బుక్కరాయసముద్రం మండలంలో 30.2 మి.మీ, నార్పల మండలంలో 31.4 మి.మీ, పుట్లూరు మండలంలో 41.6 మి.మీ, యల్లనూరు మండలంలో 23.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

గుత్తిలో భారీ వర్షం



గుత్తి: ఎంఎస్ క్రీడామైదానం కుంటను తలపిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. 52.6 మి.మీ వర్షం పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎం.ఎస్.ఫుట్‌బాల్ క్రీడామైదానం కుంటను తలపించిందిది. ఎల్ఎం బాలుర పాఠశాల ఆవరణ నీటితో నిండిపోయింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలో 44 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలం పరిస్థితి ఏర్పడిందని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి తెలిపారు. గుంతకల్లు మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది.

నేడు వాహనాల వేలం

యాడికి: వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 6 ద్విచక్ర వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 10 శాతం ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

నేడు మండల సమావేశం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

యల్లనూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ సుమతి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అయితే ప్రజల నుంచి వినతులు అందలేదని తహసీల్దార్ తెలిపారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- ఏకులనాగేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ కులమత, రాజకీయ బేధం లేకుండా సంక్షేమ పథకాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఏకులనాగేపల్లి గ్రామంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందించారు. ప్రజలు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని గడప గడపలోనూ ప్రజలు చెప్తున్నారన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందించి ప్రజల హృదయాల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేత అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయించారు. బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చెన్నకేశవులు, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు ప్రతాప్‌రెడ్డి, హనుమంతురెడ్డి, కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళ అధ్యక్షురాలు శంకుతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

- గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- 27 వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని 27వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వల్ల ఏవైనా పథకాలు అందకపోతే తిరిగి వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు నిర్మించాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరగా 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాల సొమ్ము జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, 27వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్ రంగన్న, నాయకులు అక్రమ్, సంచులబాషా, షేక్షావలి, పెంచలయ్య, కౌన్సిలర్లు చాంద్‌బాషా, సుధాకర్, సుమోబాషా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తప్పిదం.. విద్యార్థులకు శాపం

గుత్తి: కళాశాల ప్రిన్సిపాల్ తప్పు విద్యార్థులకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే ఎస్కేయూ ఐదు రోజుల క్రితం డిగ్రీ ఫైనలియర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసింది. ఇందులో గుత్తి శ్రీ సాయి డిగ్రీ కాలేజీ బీకాం ఫరీక్ష ఫలితాలు ప్రకటించలేదు. ప్రిన్సిపాల్ బీకాం ఫైనలియర్ విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్క్సును ఎస్కేయూకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదు. దీంతో ఫలితాలను వెల్లడించలేదు. ఈ విషయంపై గత ఐదు రోజులుగా బీకాం ఫైనలియర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌తో గొడవకు దిగుతున్నారు. ప్రిన్సిపాల్, ఎగ్జామినేషన్ సెక్షన్ సిబ్బంది చేసిన తప్పిదం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. విద్యార్థులు ఉన్నత చదువులకు లేదా ఉద్యోగాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డిని వివరణ కోరగా తాము ఫైనలియర్ బీకాం విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కులను నెల రోజుల క్రితమే ఎస్కేయూకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. సాంకేతిక సమస్య కారణంగా ఆన్‌లైన్‌లో కనిపించలేదన్నారు. దీంతో బీకాం రిజల్ట్స్ నిలిపివేశారన్నారు. త్వరలోనే బీకాం ఫలితాలు ప్రకటిస్తారన్నారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు గుమ్మేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

శింగనమల: మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బీ శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలమేరకు.. నార్పల మండలానికి చెందిన వినోద్ అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై పెద్దపప్పూరు వైపు వస్తుండగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వినోద్ తీవ్రంగా గాయపడినట్లు గుర్తించామని, అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తాడిపత్రి: పంట నష్టపరిహారం, ఉపాధి పని దినాల పెంపు, విద్యుత్ కోతల నివారణ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ జిల్లా కార్యదర్శి ఉమాగౌడ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, శ్రీరాములు, పూసల సంఘం మధు, గ్రామికులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నార్పల: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన నార్పల క్రాసింగ్‌లో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా, వాహన రికార్డులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. అనంతరం నిబంధనలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు స్థలాలు కేటాయించాలి

పామిడి: మండలంలోని దివ్యాంగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని విశాలా ఫెడ్రర్ వికలాంగ మండల సమాఖ్య సభ్యులు కోరారు. సోమవారం ఆ సమాఖ్య నాయకుడు కేశవాచారి ఆధ్వర్యంలో దివ్యాంగులు తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయికి వినతిపత్రం సమర్పించారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో సమభేరిలో ఉత్పన్నమైన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలంటూ ఆ పార్టీ మండల నాయకులు మల్లేసు, బాబాఫకృద్దీన్, ముత్యాలు, శంకర్, చంద్రమోహన్ రెడ్డి, గఫూర్ తదితరులు అర్జీ ఇచ్చారు.

ఇంజనీరింగ్ విద్యపై అవగాహన

తాడిపత్రి: రూరల్ పరిధిలోని టెక్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అధ్యాపక బృందం సోమవారం ఇంజనీరింగ్ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఈవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ విద్య చదవడం వలన భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలు, ఉద్యోగావకాశాలు వంటి వాటిని వివరించారు. జేఎన్‌టీయూ పరీక్షల నిర్వహణ ఎలా ఉంటుందో తెలియజేశారు. కార్యక్రమంలో డీఓఏ నటరాజేశ్వర్‌రెడ్డి, అధ్యాపక బృందం, ప్రథమ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలం

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి తెలిపారు. రైతులు పొలాల్లో ఉలవ, పెసర, అలసంద, అనప పంటలను విత్తుకోవచ్చన్నారు. జిల్లాలో అల్ప పీడనంతో కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇది వరకు సాగు చేసిన ఆముదం పంటలకు ఎకరాకు 15 కేజీల యూరియాను వేసుకోవాలన్నారు. ఆముదం, కంది పంటలలో నీటి సంరక్షణ సాళ్లను చేసుకోవాలన్నారు. బెట్టకు గురైన కంది, ఆముదం, వేరు శెనగ పంటలలో బెబెట్ట నుండి త్వరగా కోలుకోవాలంటే వర్షం ఆగిపోయిన వెంటనే పొటాషియం నైట్రేట్ (13-0-45) లీటరు నీటికి 5 గ్రాములు లేదా 19-19-19 , యూరియా 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా బెట్ట నుంచి కోలుకుంటుందన్నారు.

మట్టి గణపతులను ప్రోత్సహిద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శింగనమల: పర్యావరణానికి హాని కలగని మట్టి వినాయకులను ప్రోత్సహిద్దామని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, నిమజ్జనం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ



యల్లనూరు: బుక్కాపురంలో పింఛన్ల పంపిణీ

యాడికి: అర్హులైన వారందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి మొదటి లిస్టులో మంజూరైన 206 నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మరో రెండు రోజుల్లో రెండో లిస్టు కూడా వస్తుందని, వారికి కూడా పింఛన్ అందిస్తామన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

యల్లనూరు: మండల వ్యాప్తంగా 161 నూతన వైఎస్సార్ పింఛన్లు మంజూరయినట్లు అధికారులు తెలిపారు. సోమవారం బుక్కాపురం సచివాలయంలో ఎంపీపీ పూజారి గంగాదేవి , బుక్కాపురం సర్పంచు లక్ష్మీదేవి, వేములపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అశోక్‌కుమార్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు

శింగనమల: అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు నాయనవారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగస్వామి తెలిపారు. సోమవారం నాయనవారిపల్లి గ్రామ పంచాయతీలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: మండలానికి సంబంధించి ఫేస్-2 కింద 255 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సోమవారం తెలిపారు. అందులో పామిడి టౌన్-88, రూరల్-167 చొప్పున పింఛన్లు వచ్చాయన్నారు. ఈ పింఛన్లను ఆయా పంచాయతీ గ్రామాల్లోని సర్పంచ్‌లు పింఛన్ లబ్ధిదారులకు అందజేశారు.

రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలి



తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు రెండువందల రోజుల పనిదినాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరంగయ్య తెలిపారు. సోమవారం తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పది రోజుల వరకు వర్షాలు రాక , పంటలు ఎండిపోయాయని, ప్రస్తుతం వర్షం వచ్చినా ఫలితంలేదన్నారు. పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అదనంగా 200 పని దినాలు కల్పించి, కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి: రూరల్ పరిధిలోని ఆర్డీటీ కాలనీలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ సోమవారం తెలిపారు. రూ.3,15,200 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు.

ఉదయనిధి స్టాలిన్ క్షమాపణ చెప్పాలి



ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: 'సనాతన ధర్మం సామాజిక న్యాయానికి విరుద్ధమని, దాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న తమిళనాడు సీఎం స్టాలిన్ తనయుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాము. వెంటనే ఆయన హిందువులకు క్షమాపణ చెప్పాలి' అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓట్ల కోసమే సనాతన ధర్మాన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు అవమానిస్తున్నారని చెప్పారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ చవ్వా రంగనాథ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణస్వామి కొన్ని నెలలుగా కుటుంబసమస్యలతో పాటుగా అనారోగ్యసమస్యలతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో వైద్య చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. సమస్యలు, అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గుంతకల్లు: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలోని జింఖానా గౌండ్రలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం పేరుతో భారీ బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ సభకు అన్ని పార్టీల నాయకులనూ ఆహ్వానించామన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణరెడ్డిని ఆహ్వానిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, నాయకులు ఎస్ఎండీ గౌస్, రాముడుయల్, అగ్రిగోల్డ్ యూనియన్ నాయకులు మల్లికార్జున, జయమ్మ, తిమ్మప్ప, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గుంతకల్లుటౌన్: పాత గుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి ఆలయ రాజగోపుర స్థిరప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణ మండపంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.